సాక్షి మెదక్

బుధవారం ၊ 1 ၊ జనవరి ၊ 2025



కొంగొత్త ఆశలతో..

కొత్త ఏడాదిలో రెట్టించిన జోష్‌తో ముందుకు సాగాలని ఆశిస్తున్నారు ఉస్మానియా పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు. వివరాలు 8లో ▸



డ్రగ్స్ నివారణపై అవగాహన

మత్తు పదార్థాల నిర్మూలనలో అన్ని శాఖలు సమన్వయంతో సదస్సులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ హమీద్ అన్నారు.

వివరాలు 8లో ▸

పోలీసు యాక్ట్ అమలు

మెదక్ మున్సిపాలిటీ: శాంతి భద్రతలను దృష్ట్యా జిల్లాలో బుధవారం నుంచి నెల రోజుల పాటు 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి మంగళవారం తెలిపారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లాలో నిరసనలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు



కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో అర్హత కలిగిన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరిస్తాం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ పథకంలో అసలైన పేదలను గుర్తిస్తాం. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సిబ్బంది ఉన్నారు. అధికారులంతా బాధ్యతగా వ్యవహరించి అర్హులను గుర్తించాలని ఆదేశాలిచ్చాం. ఈ వారంలో వారితో కలిసి నేను రెండు పర్యాయాలు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తా. జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి గత ఏడాది పనితీరు పరిశీలించడంతోపాటు నూతన సంవత్సరంలో శాఖలవారీగా అధికారులకు లక్ష్యాలు నిర్దేశిస్తా. మెడికల్ కళాశాల ఏర్పాటు ఎంతో సంతృప్తి నిచ్చింది.

నేరాల నియంత్రణకు ప్రణాళిక



ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరాలు, చోరీలు, రోడ్డు ప్రమాదాలు జిల్లాలో తగ్గించడమే నూతన సంవత్సర లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం జిల్లాలోని పోలీసు అధికారులతో కలిసి ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తాం. దొంగతనాల అరికట్టేందుకు మేము సైతం కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అత్యవసరం ఉన్న 180 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. దీంతో చాలా వరకు చోరీలు అరికట్టాం. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గింది. బైక్ చోరీలను సైతం తగ్గాయి. జిల్లాలో సైబర్ క్రైమ్స్ ఎక్కువగా ఉన్నాయి. వాటిని నూతన సంవత్సరంలో మరింత తగ్గించేందుకు పనిచేస్తాం. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం సిబ్బంది కృషి చేస్తోంది. నూతన సంవత్సరంలోనూ సీసీ కెమెరాల సంఖ్యను పెంచుతాం.

న్యూస్‌రీల్

ఇందిరమ్మ సర్వే 72 శాతం పూర్తి

కలెక్టర్ రాహుల్ రాజ్



చిన్నఘనాపూర్‌లో సర్వేలో కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం(నర్సాపూర్): నిర్దేశించిన గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సర్వే సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని చిన్నఘనాపూర్‌లో మొబైల్ యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల వివరాలు నమోదు చేస్తున్న తీరును పరిశీలించారు. లబ్ధిదారుల గుర్తింపు ఫొటోలను తీసి, మొబైల్ యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సోమవారం నాటికి 72 శాతం సర్వే పూర్తి చేశామన్నారు. మిగతా 38 శాతం గడువు తేదీలోపు పూర్తి చేయాలని సంబంధిత ఎంపీడీఓలకు , ప్రత్యేకాధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. సర్వేయర్‌లు ఎలాంటి పొరపాట్లు జరగకుండా సర్వే చేయాలన్నారు. అవసరమైతే ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహాయ సహకారాలు తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ సభ్యులు తప్పకుండా ఈ ప్రక్రియలో పాల్గొనాలని, సర్వేకు సంబంధించిన ప్రతి అవసరం ఉన్న డాక్యుమెంట్లను ఇంటి సభ్యులు చూపించి సర్వే సాఫీగా జరిగేందుకు సహకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా లక్ష 91 వేల దరఖాస్తులను ప్రజాపాలనలో పెట్టుకున్నారన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ కృష్ణవేణి, సర్వేయర్లు ఉన్నారు.

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



మెదక్‌జోన్: మెదక్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ మంగళవారం తెలిపారు. సుఖసంతోషాల నడుమ కొత్త సంవత్సర వేడుకలను ప్రజలందరూ సుఖసంతోషాలతో ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. 2025లో ప్రజలందరికీ మంచి కలగాలని కోరుకున్నట్లు తెలిపారు.

22వ రోజుకు ఉద్యోగుల నిరసన



సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ మంత్రులు చర్చలు జరిపి ఉద్యోగులకు లాభం చేకూర్చకుండా, అడగనటువంటి హామీలను నెరవేరుస్తామని చెప్పడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు రాజు, కార్యదర్శి పాషా, రాజశేఖర్, సంపత్, శ్రీనివాస్, ఆంజనేయులు, కనకరాజు, కవిత, మంజుల, ధరణి పాల్గొన్నారు.

ఆ నెలలోనే పెన్షన్ పత్రాలు

పటాన్‌చెరు టౌన్: పదవీ విరమణ పొందిన నెలలోనే పెన్షన్ ప్రయోజనాలను మంజూరు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం, పదవీ విరమణ ప్రక్రియ సాఫీగా జరిగేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. మంగళవారం పదవీ విరమణ పొందిన చందాదారులకు పెన్షన్ చెల్లింపు ఆర్డర్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. డిసెంబర్‌లో పదవీ విరమణ పొందిన 23 చందాదారులకు పీపీఓలను జారీ చేసి అందులో ఆరుగురికి అందజేస్తామన్నారు. కార్యక్రమానికి పీఎఫ్ కమిషనర్–2 శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ, అకౌంట్స్ ఆఫీసర్ అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

కాలకూట విషం!

మంజీరా నది కలుషితమవుతోంది. హత్నూర, పటాన్‌చెరుల్లో ఉన్న పలు ఫ్యాక్టరీల వ్యర్థ జలాలు కలుస్తుండటంతో నీటి రంగు మారింది. స్నానాలు చేస్తే చర్మ వ్యాధులు తప్పవని స్థానికులు భయపడుతున్నారు. అలాగే.. సాగుపై కూడా ప్రభావం చూపుతోంది.

మంజీరాలో నీరు కలుషితం

- హత్నూర, పటాన్‌చెరు పరిశ్రమల వ్యర్థ జలాలే కారణం
- ఆకుపచ్చ రంగులో నీటి ప్రవాహం



ఆకుపచ్చ రంగులోకి మారిన మంజీరా నది

చిలప్‌చెడ్(నర్సాపూర్): మంజీరా నది స్వచ్ఛమైన తాగునీటికి పేరొందింది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు, హైదరాబాద్ వాసులకు దాహార్తిని తీర్చుతోంది. కానీ చిలప్‌చెడ్ ప్రాంతంలో ప్రవహిస్తున్న నది చెంతకు రావడానికే జనాలు జంకే పరిస్థితి. అందుకు కారణం హత్నూర, పటాన్‌చెరు ప్రాంతాల పరిశ్రమలు వదిలిన వ్యర్థ జలాలు. ఆకుపచ్చ రంగుమారిన కలుషిత జలాలు ప్రవహిస్తున్న నీటిని చూసి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుణ్య స్నానాలు ఆచరిస్తే చర్మ వ్యాధులు తప్పవని పలువురు పేర్కొంటున్నారు. ప్రవాహం సాధారణస్థాయిలో పారుతుంటే నీరు తెల్లగా, స్వచ్ఛగా ఉంటాయి. సింగూరు నుంచి కొంత ప్రవాహం ఆగిపోతే నీరు ఆకు పచ్చ రంగులో కనిపిస్తున్నాయి. గుర్రపు డెక్క కూడా అందులో పేరుకుపోయింది. ప్రస్తుతం ఈ పరిస్థితి ఇక్కడ నెలకొంది.

జంకుతున్న రైతులు

- యాసంగి సీజన్ ప్రారంభమైతే రైతులు ఈ నది నుంచే సాగు నీటిని వినియోగించుకుంటారు. మోటార్ల ద్వారా తరలించుకుంటారు. ప్రస్తుతం రంగుమారిన నీటిని చూసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయానికి ఎలా వినియోగించాలని మదనపడుతున్నారు. ఇక మత్స్యకారులకు ఉపాధి సౌకర్యం కోల్పోయారు. కలుషిత నీటిలో అసలు చేపలు దొరకడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి మంజీరాలో వ్యర్థ జలాలు కలవకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నదిలో దిగేందుకు భయపడ్డా



సాగు నీటి కోసం మోటారు దించేందుకు నది దగ్గరికి వెళ్లా. నది అంచున్న పేరుకుపోయిన ఆకుపచ్చని గుర్రపుడెక్క పేరుకునిపోయి ఉంది. దిగేందుకు భయపడ్డా. మోటారు పనుల నిమిత్తం మరో స్నేహితుడిని పిలిచా. డెక్కను తొలగించాం.

: మొగులయ్య, రైతు, చండూర్

పరిస్థితి దారుణం



మంజీర నది ఒడ్డున ఉన్న చాముండేశ్వరి అమ్మవారి దర్శనానికి వెళ్లినప్పుడు నదిలో స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకుంటాను. ప్రస్తుతం పరిస్థితి దారుణంగా ఉంది. మంజీర నదిలో స్నానం చేస్తే చర్మవ్యాధులు వచ్చేలా ఉంది.

సుధాకర్, చిట్కుల్

నిఘా నీడలో దవాఖానాలు



దవాఖానాలు సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయి. దీంతో సిబ్బంది విధులకు హాజరవుతున్నారా? లేక డుమ్మా కొడుతున్నారా అనే అంశాలను కలెక్టర్, వైద్యారోగ్య శాఖాధికారులు పర్యవేక్షిస్తారు. జిల్లా ఆస్పత్రి సహా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ అనుసంధాన హాస్పిటల్స్ మొత్తం కలిపి 24 చోట్ల నిఘా ఏర్పాటు చేశారు. విధుల్లో పారదర్శకత పాటించేందుకు చర్యలు చేపడుతున్నారు.

జిల్లా ఆస్పత్రి సహా 24 హాస్పిటల్స్‌లో సీసీ కెమెరాలు

- డాక్టర్లు, సిబ్బంది కదలికలపై కన్ను
- రోగులకు అందుతున్న మెరుగైన సేవలు



డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌లో సీసీ ఫుటేజీ

మెదక్‌జోన్: మెదక్ కేంద్రంలో ఉన్న జిల్లా ఆస్పత్రితో పాటు 20 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు 3 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, ఏరియా ఆస్పత్రితో సహా మొత్తం 25 హాస్పిటల్స్ ఉన్నాయి. బీఆర్‌ఎస్ హయాంలో వాటి నిర్వహణ పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో పీహెచ్‌సీలతో పాటు అన్ని ఆస్పత్రులలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కొన్ని నెలలు తర్వాత నిర్వహణ లోపం వల్ల పని చేయకుండా పోయాయి. దీంతో జిల్లాలో వైద్య సేవలు పూర్తిగా కుంటుపడ్డాయి.

వైద్యసిబ్బంది సస్పెండ్

కలెక్టర్ రాహుల్‌రాజ్ 2024 మార్చిలో బదిలీపై జిల్లాకు వచ్చి రాగానే వైద్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారు. సెప్టెంబర్‌లో ఆకస్మికంగా కొడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. సూపర్‌వైజర్లు రమేశ్, వంశీకృష్ణలతో పాటు హెచ్‌ఈఓ అబ్దుల్ షకీల్ ఉదయం విధులకు హాజరై రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. మధ్యాహ్నం కలెక్టర్ ఆస్పత్రిని తనిఖీ చేసి డుమ్మాకొట్టిన ముగ్గురిని సస్పెండ్ చేశారు. అనంతరం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల గురించి ఆరాతీయగా అవి చాలాకాలంగా పని చేయటం లేదని సంబంధిత అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వెంటనే వాటిని మరమ్మతులు చేయాలని ఆదేశాలిచ్చారు. దీంతో వెంటనే రిపేర్లు చేయించారు. ఇంటర్నెట్ లేకుంటే కనెక్షన్ ఇప్పించారు.

సిబ్బంది పనితీరు పరిశీలిస్తున్నాం



గతంలో ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయక పోవడంతో కలెక్టర్ అన్ని హాస్పిటల్‌లో సీసీలను మరమ్మతు చేయించారు. సీసీలు లేని ఆస్పత్రుల్లో నూతనంగా ఏర్పాటు చేయించారు. వాటి ఆధారంగా రోజూ సిబ్బంది పనితీరు గమనిస్తున్నాం. ఎవరైనా సకాలంలో రాకుంటే వెంటనే వివరణ కోరుతున్నాం.

– శ్రీరాం, జిల్లా వైద్యాధికారి మెదక్

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీల్లో సైతం సీసీలను ఏర్పాటు చేశారు. ఒక్కో పీహెచ్‌సీల్లో మూడు సీసీలను పెట్టారు. అలాగే కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు ఏరియా ఆస్పత్రి, జిల్లా ఆస్పత్రుల్లో ప్రాధాన్యత క్రమంలో సీసీలను బిగించారు. కలెక్టర్, డీఎంహెచ్‌ఓ ఆఫీస్‌తో పాటు హైదరాబాద్‌లోని వైద్యారోగ్య కమిషనరేట్‌లోనే మానిటరింగ్ చేస్తున్నారు. దీంతో వైద్యులతో పాటు సిబ్బంది సమయానికి విధులకు హాజరుకావడంతో రోగులకు సరైన వైద్యసేవలు అందుతున్నాయి.



హుస్నాబాద్‌లోని పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

హ్యాపీ న్యూఇయర్

- 2024కు వీడ్కోలు.. 2025కు స్వాగతం
- కేక్ కటింగ్‌లు.. విందు, వినోదాల్లో మునిగిన యువత
- మెదక్ కేథడ్రల్‌లో ప్రత్యేక ప్రార్థనలు



సంగారెడ్డి: కేకులు చూస్తున్న యువతులు

మెదక్‌జోన్: న్యూ ఇయర్ సందర్భంగా చర్చిలో మంగళవారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరికొకరు నూతన సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. 2024కు వీడ్కోలు పలుకుతూ 2025కు వెల్‌కం పలికారు. కేకులను కట్ చేసి శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఈ నేపథ్యంలో మెదక్ సీఎస్‌ఐ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య.. ప్రార్థనలు చేసి భక్తులకు దైవసందేశాన్ని ఇచ్చారు. మంగళవారం రాత్రి నుంచే జిల్లాలో యువత విందులు, వినోదాలతో మునిగారు. బేకరీల వద్ద హడావిడి కనిపించింది. అర్ధరాత్రి 12 గంటలు కాగానే హ్యాపీ న్యూఇయర్ అంటూ చిన్నాపెద్ద సందడి చేశారు. యువత కేరింతలతో ఆయా ప్రాంతాలన్నీ పండుగ వాతావరణాన్ని తలపించింది.




విజేతగా నిలిచిన నిజామాబాద్ మహిళల జట్టు

పురుషుల సాఫ్ట్‌బాల్ విజేత హైదరాబాద్

- మహిళల విభాగంలో నిజామాబాద్
- విజయవంతంగా ముగిసిన సీఎం రాష్ట్రస్థాయి కప్ పోటీలు

మెదక్ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పురుషుల విభాగంలో విజేతగా హైదరాబాద్, మహిళల విభాగంలో నిజామాబాద్ జట్టు గెలుపొందింది. మెదక్ జిల్లా కేంద్రంలో నాలుగు రోజులు నుంచి జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. పురుషుల విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో హైదరాబాద్ జట్టు గెలుపొందింది. నిజామాబాద్ జట్టు రెండవ స్థానం, మెదక్ జిల్లా జట్టు మూడవ స్థానం పొందింది. మహిళల విభాగంలో నిజామాబాద్ జట్టు తొలిస్థానంలో నిలిచింది. సిద్దిపేట జిల్లా జట్టు రెండో స్థానం, హనుమకొండ జట్టు మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు మాట్లాడారు. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చారన్నారు. క్రీడాకారులు ప్రతిభ చాటుకున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో మొట్ట మొదటిసారిగా రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలు జరగడం హర్షణీయమన్నారు. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించామన్నారు. పోటీల్లో మొదటిస్థానం సాధించిన జట్టుకు రూ.లక్ష, ద్వితీయస్థానం పొందిన జట్టుకు రూ.75వేలు, తృతీయస్థానం జట్టుకు రూ.25వేలు అందజేయనున్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి శ్యాంసుందర్ శర్మ, భరత్ కుమార్, నాగరాజు, శ్రీనివాసరావు పీడీలు మాధవరెడ్డి, శ్యామ్, రవి, దేవేందర్ రెడ్డి, రవి, రూపేందర్, అల్లి నరేశ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గెలుపొందిన హైదరాబాద్ పురుషుల జట్టు

మెరుగైన సేవలు అందించాల్సిందే

శివ్వంపేట(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు గర్భిణులకు బాలింతలకు కొత్త సంవత్సరంలో మెరుగైన సేవలు అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. మంగళవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. టీచర్లు సమయపాలన పాటించాలని, ఆహారం అందించే విషయంలో పరిశుభ్రత తప్పని సరిగా పాటించాలన్నారు. ఆరోగ్యలక్ష్మి ద్వారా నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులు ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలపాల్సిన బాధ్యత టీచర్లపై ఉందన్నారు. ఆటపాటలతో పిల్లలకు బోధన చేస్తూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా ముందస్తు నూతన సంవత్సర సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ సంతోష, సిబ్బంది, తదితరులు ఉన్నారు.




అంగన్‌వాడీ టీచర్లతో సీడీపీఓ హేమ

ప్రైవేటీకరణ యత్నం మానుకోండి

విద్యుత్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా

మెదక్ కలెక్టరేట్: విద్యుత్ ప్రైవేటీకరణ వెంటనే నిలిపివేయాలని టీజీయూఈఈయూ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహులు, రవీంద్ర ప్రసాద్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణలలోని డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలైనట్లు తెలిపారు. దాదాపు అన్ని రాష్ట్రాలలో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా దొడ్డిదారిన ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఉపందుకున్నట్లు చెప్పారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యుత్ రంగా కార్మికులు వీరోచితమైన పోరాటం చేస్తున్నారని తెలిపారు. వారికి మద్దతుగా టీజీయూఈఈయూ–సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2003లో విద్యుత్ చట్టానికి మార్పులు చేయడానికి ప్రయత్నించినప్పుడు కూడా చండీగఢ్ విద్యుత్ రంగ కార్మికులు సమరశీలంగా పోరాడినట్లు గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం దక్షిణ హైదరాబాద్ సర్కిల్ విద్యుత్ పంపిణీ సేవలను అదానీ గ్రూప్‌నకు కట్టబెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు. ఇవాళ కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్నారు. ఈ రంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న కార్మికులు, ఇంజనీర్లకు మద్దతుగా ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున మద్దతును తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో చంద్రభాను, సురేశ్, శ్రీనివాస్, రమేశ్, సలీం, బాలకృష్ణ, నరేశ్, గౌరీకృష్ణ, పృథ్వీ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్: జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ఆందోళన

తూప్రాన్: కేంద్ర ప్రభుత్వం చండీగఢ్, ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే యత్నాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు ఊపందుకున్నాయని టీజీయూఈఈయూ సీఐటీయూ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఏ.మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం విద్యుత్ సబ్ డివిజన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కేంద్రంలో మూడవసారి ఏర్పడిన మోదీ ప్రభుత్వం గతంలో కన్నా మరింత దూకుడుగా చండీగఢ్, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఆందోళనలో టీజీఎస్‌పీడీసీఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు స్వామి, శ్రీను, హనుమంతు, రాజు, రామకృష్ణ, వెంకటేశ్, భాగ్యరాజు, నవనీత, విజయ, శోభ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొలంలోనే ప్రాణాలు వదిలిన రైతు

పనిచేస్తూ కిందపడటంతో మృతి


కిష్టయ్య(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): పొలంలో పనిచేస్తున్న రైతు బురదలో పడిపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన కౌడిపల్లి మండలం భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(42) మంగళవారం ఉదయం సొంత పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ కిందపడటంతో బురదలో పడిపోయాడు. కొద్దిసేపటికి తోటి రైతులు గుర్తించి చికిత్స నిమిత్తం గ్రామంలోనికి తీసుకురాగా అప్పటికే మృతి చెందాడు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పురుగుల మందు కలిసిన మద్యం తాగి

ఇద్దరికి అస్వస్థత ఆస్పత్రిపాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): పశువుల పాకలో ఉన్న మద్యం తాగి ఇద్దరు వ్యక్తులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఘటన మండలంలోని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నిరుగంటి నర్సింలు, కొట్టాల కనకయ్య ఐదు రోజుల కిందట పశువుల పాకలో ఎవరో పెట్టిన మద్యాన్ని తాగారు. తాగిన రెండు, మూడు రోజులకు శరీరంపై దద్దుర్లు రావడంతోపాటు అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల పరీక్షల నిమిత్తం మద్యంలో పురుగుల మందు కలిసినట్లు తేలింది. ఇరువురి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన వారే పురుగుల మందు కలిపి పెట్టారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

భూ వివాదంలో దాడులు

26 మందిపై కేసు నమోదు

టేక్మాల్(మెదక్): భూ వివాదంలో ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో 26 మందిపై కేసు నమోదు చేసినట్లు టేక్మాల్ ఎస్‌ఐ రాజేశ్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని సీఎంతండాకు చెందిన రమావత్ విఠల్, సక్రియాల మధ్య కొంత కాలంగా భూ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గతనెల 30న టేక్మాల్‌లో మాట్లాడుకుందామని ఇరువర్గాలు చర్చించుకున్నారు. ఈ విషయంలో మాటామాటా పెరిగి కుటుంబ సభ్యులు విఠల్ కుటుంబ సభ్యులపై దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. అదే రోజు రాత్రి రమావత్ విఠల్ కుటుంబ సభ్యులు 20 మందితో కలిసి సక్రియా కుటుంబ సభ్యుల ఇంటికెళ్లి దాడి చేశారు. ఈ విషయంలో ఇరువర్గాలకు చెందిన 26 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు. పూర్తి వివరాలను మంగళవారం సాయంత్రం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌ను అల్లాదుర్గం సీఐ రేణుక సందర్శించి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వాహనాల తనిఖీ

సిద్దిపేటకమాన్: పోలీసు కమిషనరేట్ పరిధిలో పోలీసులు మంగళవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ, వాసుదేవరావు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు ఉమేష్, సదాశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS SERVICES

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర।। 8376001873, 9643010487, 8376089771, 011-25920179 [DA-6124]

WANTED

■ Wanted School Bus Driver we are looking for a reliable and responsible School Bus Driver to join our Team. Requirements: Valid Driver's license (CDL Preferred). Clean Driving Record. Punctual and Dependable. if you are interested or know someone who might be, please share the details to Gandhi Centenary High School, Sangareddy - 6305818044 [HA-1256717]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొంగొత్త ఆశలతో..

న్యూ ఇయర్‌కు ఆహ్వానం

- లక్ష్యాన్ని నిర్దేశించుకొని మరింత ముందుకు
- జోష్‌లో సిద్దిపేట పీజీ విద్యార్థులు



కాలం ఎవరి కోసం ఆగదు.. కాలగమనంలో మరో సంవత్సరం కనుమరుగైంది.. ఆంగ్ల నూతన సంవత్సరం 2025కు విద్యార్థులు, యువకులు, చిన్నా, పెద్ద అందరూ తమ మిత్ర బృందంతో రకరకాల కార్యక్రమాలను నిర్వహించి స్వాగతం పలికారు. అలాగే, కొత్త ఆశలు.. కొంగొత్త ఆకాంక్షలు.. సరికొత్త ఆలోచనలతో నూతన సంవత్సరంలో రెట్టించిన జోష్‌తో ముందుకు సాగాలని ఆశిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేస్తున్న పలువురు విద్యార్థులను 'సాక్షి' పలకరించింది. నూతన సంవత్సరానికి స్వాగతం పలకడం మొదలుకొని గత సంవత్సర అనుభూతులు, ఈ సంవత్సరం తాము నిర్దేశించుకున్న లక్ష్యాలు, వాటిని నెరవేర్చుకునేందుకు తగిన ప్రణాళికలు తదితర అంశాలపై పీజీ విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

– సిద్దిపేటఎడ్యుకేషన్:



ఉన్నత స్థానంలో స్థిరపడతా..



ప్రతీ నూతన సంవత్సరానికి కొన్ని లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించేందుకు ప్రయత్నిస్తున్నాను. 2024లో ఆశించిన స్థాయిలో లక్ష్యాలను చేరుకోలేక పోయాను. ఉత్తమ ప్రతిభా పాటవాలతో పీజీని పూర్తి చేసి ప్లేస్‌మెంట్ సాధించి జీవితంలో ఉన్నత స్థానంలో స్థిరపడతాను. అందుకోసం 2025 సంవత్సరంలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతాను.

–నవీన్, ఎంసీఏ, ప్రథమ సంవత్సరం

నైపుణ్యాలు పెంచుకుంటా..



నూతన సంవత్సరంలో నైపుణ్యాలను మరింతగా పెంచుకొని జీవితంలో స్థిరపడతాను. ప్రస్తుతం ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతూనే ఇంటర్న్‌షిప్ చేస్తున్నాను. 2024 ఎన్నో అనుభూతులను, జ్ఞాపకాలను మిగిల్చింది. 2025కు వెల్‌కమ్‌లో భాగంగా ఫ్రెండ్స్ అందరం కలిసి చిన్న పార్టీతో నూతన సంవత్సరాన్ని ప్రారంభించాలనుకుంటున్నాం. ఒక మంచి కంపెనీలో హెచ్‌ఆర్‌లో ఉద్యోగం సంపాదిస్తాను.

–మేఘన, ఎంబీఏ, ద్వితీయ సంవత్సరం

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం



నేను ప్రస్తుతం ఎంఏ ఇంగ్లిష్ ప్రథమ సంవత్సరం చేస్తున్నాను. గత సంవత్సరంలో నా గ్రాడ్యుయేషన్ పూర్తి కావడంతో 2024 నాకు ఎంతో ప్రత్యేకమైనది. మిత్రులతో కలిసి నూతన సంవత్సరం వేడుకలను చేసుకుంటాం. 2025లో నాలో నేను ఎన్నో మార్పులు చేసుకోవాలనుకుంటున్నా. ఒక ప్రత్యేక ప్రణాళికతో నిరంతం శ్రమించి ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలన్నదే నా ఆశ... ఆకాంక్ష.

–మల్లేశ్, ఎంఏ, ఇంగ్లిష్, ప్రథమ సంవత్సరం

ప్రమోషన్ సాధిస్తా..



2024కి బై బై చెబుతూ.. 2025కి వెల్‌కం చెప్పాం. నేను మా స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఇయర్‌కి సెండాఫ్ చెప్పాం. న్యూ ఇయర్‌లో అందరం బాగుండాలని.. దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఏ పండుగ అయిన, శుభ సమయమైనా కుటుంబ సభ్యులతో నిర్వహించుకుంటే ఉండే సంతోషమే వేరు. ఉద్యోగ ఒత్తిడి తక్కువగా ఉండాలని, ఉద్యోగంలో ప్రమోషన్ రావాలని దేవుడిని కోరుకున్నాను. అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు

–సుభాషిణి, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, సిద్దిపేట

కష్టపడి చదువుతా..



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ సంతోషంగా నిర్వహించుకున్నాం. మా ఇంట్లో, మా బంధువులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నాం. గత సంవత్సరంలోని మధురస్మృతులను గుర్తు చేసుకొని, ఈ కొత్త సంవత్సరంలో సాధించాల్సిన లక్ష్యాలను నోట్ బుక్‌లో నోట్ చేసుకున్నా. మంచిగా చదువుకొని, మంచి మార్కులు సాధించాలని, లక్ష్యంగా పెట్టుకున్నాను. మా కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది.

–ప్రణిత, ఇంజనీరింగ్ విద్యార్థిని, సిద్దిపేట

సాఫ్ట్‌వేర్‌ను అవుతా..



వెల్‌కం న్యూ ఇయర్ 2025... నూతన సంవత్సర వేడుకలకు నా మిత్రులందరితో కలిసి ఇంటి వద్దనే ప్లాన్ చేసుకున్నాను. నా చేతులతో ప్రత్యేకంగా బిర్యానీ చేస్తా.. ఇంటర్‌లో సీఈసీ తీసుకోవడంతో డిగ్రీ, బీకాం, పీజీ ఎంబీఏ చేస్తున్నాను. 2025లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జూలై 21 నా పుట్టిన రోజు నాటికి మొదటి సాలరీ అందుకోవాలన్నదే నా లక్ష్యం అందుకు 2025 సంవత్సరం కలిసి వస్తుందనకుంటున్నా.

–శ్రీజ, ఎంబీఏ, ద్వితీయ సంవత్సరం

సాంకేతిక పరిజ్ఞానంతో..



నూతన సంవత్సరం వస్తుందంటే ప్రతి ఒక్కరికీ ఎంతో సంతోషంగా ఉంటుంది. బంధు మిత్రుల సంబురాలు, వేడుకలు మొత్తంగా ఎంతో జోష్ ఉంటుంది. ఎంసీఏ పూర్తి చేసి హ్యాకర్ కావాలన్నది నా కల.. అందుకు 2025 సంవత్సరం నాకు కలిసి వస్తుందనుకుంటున్నా.. ప్రస్తుతం సమాజ వ్యతిరేక శక్తులు ఆధునిక సాంకేతి పరిజ్ఞానాన్ని వాడుకుంటూ ప్రభుత్వాలకు, ప్రజలకు ఎంతో నష్టం చేకూరుస్తున్నాయి. అలాంటి వారిని పట్టించేందుకు ప్రభుత్వానికి సహకరించేందకు కృషి చేస్తా.

–ఉదయ్‌కిరణ్, ఎంసీఏ, ప్రథమ సంవత్సరం

బిజినెస్ మ్యాన్‌గా..



మా ఫ్రెండ్స్ అందరితో కలిసి క్రాకర్స్ కాల్చడంతో పాటు కేక్‌లు కట్ చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతాం.. రాత్రంగా పండుగ వాతావరణం నెలకొల్పుతాం. మా హెచ్ఓడీ డాక్టర్ రాజు సర్‌తో కేక్ కట్ చేయిస్తాము. నా ఎంబీఏ పూర్తి చేసిన తర్వాత ఓ మంచి బిజినెస్ మ్యాన్‌ను అవుతాను. అందుకోసం నాకు కొన్ని ఆలోచనలు ఉన్నాయి. 2025 సంవత్సరంలో మరిన్ని నూతన ఆలోచనలతో ముందుకు సాగి నా లక్ష్యాన్ని నెరవేర్చుకుంటున్నాను.

–సాయికుమార్, ఎంబీఏ, ప్రథమ సంవత్సరం

నిషేధిత ఆల్ఫాజోలం పట్టివేత

ముగ్గురు అరెస్ట్ : ఎస్పీ చెన్నూరి రూపేశ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి జోన్: అక్రమంగా రవాణా చేస్తున్న నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్‌ను పట్టుకున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ వెల్లడించారు. మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అల్లాదుర్గం మండల పరిధిలోని గడిపెద్దాపురం గ్రామానికి చెందిన డొల్లూరి సాయిలు అలియాస్ రాజు అదే గ్రామానికి చెందిన సంఘం సొసైటీలో కల్లు డిపోను లీజుకు తీసుకొని వ్యాపారం చేస్తున్నాడు. తప్పుడు మార్గంలో అధిక డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకొని చిన్ననాన్న నారాయణమూర్తికి చెప్పాడు. అతడికి తెలిసిన ముదిమాణిక్యం గ్రామానికి చెందిన అశోక్ గౌడ్ ఆల్ఫాజోలం అమ్ముతాడని తెలుసుకున్నాడు. సాయిలు ఆల్ఫాజోలం తీసుకొని మంగళవారం బైక్ పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఉదయం 11 గంటల ప్రాంతంలో సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టి సాయిలు వద్ద 350 గ్రాముల నిషేధిత ఆల్ఫాజోలం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3,50,000 వరకు ఉంటుందన్నారు. విచారణలో అశోక్‌గౌడ్‌కు ఫోన్ గుర్తు తెలియని వ్యక్తితో పరిచయం ఏర్పడి ముత్తంగి వద్దకు అమ్ముతాడని తెలిసిందన్నారు. గుర్తు తెలియని వ్యక్తి పరారీలో ఉండగా, ముగ్గురిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావు, పటాన్ చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివ కుమార్, జిన్నారం ఇన్‌స్పెక్టర్ నయీముద్దీన్ సీసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేర్యాలలో గంజాయి..

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఎస్‌ఐ నీరేశ్‌తో కలిసి మాట్లాడారు. పట్టణ కేంద్రంలోని యాదవనగర్ గ్రంథాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి ఎస్‌ఐ నీరేశ్, సిబ్బంది రైడ్ చేసి పట్టణానికి చెందిన శ్రీధర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 490 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పరిహారం రాలేదని రైతు ఆత్మహత్యాయత్నం

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో నిరసన
- ఆరేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన
- మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించాలని వేడుకోలు


పురుగు మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతు సంపత్

అక్కన్నపేట(హుస్నాబాద్): న్యాయం చేస్తారా.. లేక ఆత్మహత్య చేసుకోవాలంటూ ఓ రైతు నేరుగా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగారు. అప్రమత్తమైన అధికారులు రైతును అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన నందారపు సంపత్ అనే రైతుకు సర్వే నంబర్ 461లో సుమారుగా 1.10 ఎకరాల భూమి గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైంది. నష్ట పరిహారం కోసం 2016 సంవత్సరం నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. ఇటీవలె ఓ ఆర్ఐ సైతం విచారణ చేసి పరిహారం వస్తుందని సంతకాలను పెట్టించాడు. కానీ రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప పరిహారం ఇవ్వడం లేదని ఆవేదనతో తహసీల్దార్‌కి పురుగు మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తనకు రావాల్సిన నష్టపరిహారం ఇతరులకు ఇచ్చారని, పరిహారం వచ్చినట్లు ఎంజాయ్‌మెంట్ సర్వేలో పేర్కొందని రైతు వాపోయారు. మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టిసారించి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. ఈ పరిహారం ఘటనపై విచారణ చేపడతామని తహసీల్దార్ అనంతరెడ్డి తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందులతో..

మద్దూరు(హుస్నాబాద్): అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల కథనం మేరకు.. ధూళ్మిట్ట మండల పరిధిలోని జాలపల్లికి చెందిన బందారం మల్లేశం (60) గతంలో రోడ్డు ప్రమాదానికి గురై ఎడమ కాలు తొలగించడంతో ఏ పని చేయలేక ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఆస్పత్రి ఖర్చులు, ఇల్లు గడవడానికి ఆర్థికంగా ఇబ్బందులు రావడంతో మనస్తాపం చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సత్యలక్ష్మి ఫిర్యాదు మేరకు మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనారోగ్యంతో మనస్తాపం చెంది..

బెజ్జంకి(సిద్దిపేట) : అనారోగ్యంతో మనస్తాపం చెంది ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని గుండారంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. మండలంలోని గుండారం గ్రామానికి చెందిన తాల్లపల్లి మల్లేశం (55) కొన్నేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. దీనికి తోడు పచ్చ కామెర్లు సమస్యతో బాధ పడుతున్నాడు. సోమవారం భార్య భాగ్యలక్ష్మీ కూలీ పనికి వెళ్లింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మల్లేశం తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సంజీవ్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి..

శివ్వంపేట(నర్సాపూర్) : మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధి గుండ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెంజర్ల మల్లయ్య(64)కు రెండేళ్ల కిందట పక్షపాతం రావడంతోపాటు మతిస్థిమితం కోల్పోయాడు. సోమవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం గ్రామ శివారులోని పబ్బన కుంటలో మల్లయ్య మృతదేహం కనిపించింది. అనారోగ్య సమస్యలతో జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు కుమారుడు యాదగిరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సైలెన్సర్ మార్ఫింగ్ చేస్తే కఠిన చర్యలు

- సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్


సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: వాహనాల సైలెన్సర్‌లు మార్ఫింగ్ చేసే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్, సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేటలో కొద్ది రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. అధిక శబ్దాలు చేస్తూ కాలుష్యానిచ్చే 53 వాహనాలను పట్టుకొని వాటి సైలెన్సర్లను తొలగించి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఏసీపీ, ట్రాఫిక్ సీఐల ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ.. ఆర్టీవో నిబంధనలు ఉల్లంఘించి వాహనాలకు సైలెన్సర్లు మార్ఫింగ్ చేస్తున్నారని శబ్ద కాలుష్యంతో పాటు ఇతరులను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. స్థానిక కోమటి చెరువు, మెదక్ రోడ్డు, రంగనాయక సాగర్ ప్రాజెక్టు, రూరల్ పీఎస్ బైపాస్ రోడ్డు, ఎగ్బాల్ మినార్, ఇతర ప్రాంతాల్లో యువకులు బైక్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్‌ఐలు ఉమేశ్, సదాశివరావు, హెడ్ కానిస్టేబుల్ సత్యం, సిబ్బంది కొన్నె మహేష్, అనిల్, కిషన్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.56.23 లక్షల విలువైన డ్రగ్స్..


కారులో తరలిస్తున్న డ్రగ్స్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ సమీపంలోని చిరాగ్‌పల్లి అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద మంగళవారం ఎక్సైజ్ అధికారులు నిషేధిత ఆల్ఫాజోలం టాబ్లెట్స్, దగ్గు మందు సీసాలను పట్టుకున్నారు. ఎక్సైజ్ మెదక్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి కథనం మేరకు.. హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ ప్రాంతానికి చెందిన ఎండీ.అస్లమ్, ఎండీ. అలీంఖాన్ కర్నాటక రాష్ట్రంలో నిషేధిత ఆల్ఫాజోలం టాబ్లెట్స్, కోడినెట్ దగ్గు మందును కొనుగోలు చేసుకొని హైదరాబాద్‌కు తరలించి అనుమతులు లేని మెడికల్ దుకాణాల్లో విక్రయిస్తున్నారు. ముందస్తు సమాచారం మేరకు రాష్ట్ర సరిహద్దులో గల చిరాగ్‌పల్లి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నాటక నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ కారును అనుమానంతో తనిఖీ చేయగా 7,500 ఆల్ఫాజోలం టాబ్లెట్స్, 150 దగ్గు మందు బాటిల్స్ లభించాయి. వీటి విలువ రూ.56.23 లక్షలు ఉంటుందని, ఇద్దరిని అరెస్టు చేసి కారు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి


మాట్లాడుతున్న తాటికొండ రవి

సిద్దిపేట ఎడ్యుకేషన్: నూతన సంవత్సరం ప్రారంభం నుంచి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజులను అరికట్టే విధంగా అలాగే సామాన్య, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు లబ్ధి చేకూరేలా ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులను కట్టడి చేయాలన్నారు. ఒక్కొక్క పాఠశాలలో ఒక్కో రకమైన ఫీజులను నిర్ణయించడం అనేది సరికాదన్నారు. గతంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫీజుల నియంత్రణ కోసం కమిటీని వేసిందని, కానీ కమిటీ సూచనలను అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనకు నిదర్శనంగా కనబడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు సతీష్, ప్రశాంత్, సందీప్, రాకేష్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- రోడ్డు భద్రత, మత్తు పదార్థాల నియంత్రణపై అధికారులతో సమావేశం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటరూరల్: జిల్లాలో రోడ్డు ప్రయాణాలు, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగ నిషేధం పై అన్ని శాఖలు సమన్వయంతో అవగాహన సదస్సులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో రోడ్డు భద్రత కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఎక్కడి నుంచి రవాణా అవుతుందో అన్వేషణ చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో డ్రగ్స్‌పై అవగాహన వీడియోలు, ఫొటోలతో ప్రచారం చేయాలన్నారు. అదే విధంగా జిల్లాలో నిర్వహించే బెల్ట్ షాపుల పై చర్యలు తీసుకోవాలని, విద్యాసంస్థల్లో డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. రోడ్డు, రద్దీ ప్రాంతాల్లో బస్సులు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడం వంటివి జరగకుండా చూడాలని, ఆటో యూనియన్‌లతో మీటింగ్‌లు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ బీ.మనోహర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస మూర్తి, ఏసీపీ మధు, జిల్లా వైద్యాధికారి డా.పల్వాన్ కుమార్, రహదారుల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.